

నిత్యం.. మురుగు ప్రవాహం

ఎల్‌బీనగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ రోడ్లపై మురుగు ఏరులై పారుతోంది. డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ రోడ్డు నంబర్–3 లోని రోడ్డుపై మురుగు పారడం నిత్యకృత్యమైంది. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై నిత్యం మురుగు పారుతుండటంతో దుర్వాసతో పాటు రోడ్డు ధ్వంసమై ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. –హస్తినాపురం



నీటి వృథా.. ఎవరికీ పట్టదా?

లక్షల లీటర్ల తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్ ప్రభుత్వ పెట్రోల్‌బంక్ సమీపంలో గత మూడ్రోజులుగా మంచినీటి వాల్వ్ లీకై విలువైన తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. మురుగునీరు కలుస్తుండటంతో కలుషితమై సరఫరా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి వృథాపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయయి. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –లింగోజిగూడ

అనాలోచిత నిర్ణయం.. ఆక్రమణలకు నిలయం..

అధికారుల అనాలోచిత నిర్ణయాలతో రూ. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఓ వైపు పలు కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు అభివృద్ధి చెందిన కాలనీలలో బాగున్న రోడ్లను తవ్వి మళ్లీ రోడ్లు వేయడం , అవసరం లేకున్నా ఫుట్‌పాత్‌ను నిర్మిస్తూ ప్రజాధనం వృథా చేస్తున్నారు. ఇటీవల వనస్థలిపురం రెడ్‌వాటర్ ట్యాంక్ నుంచి ఎన్జీవోస్‌కాలనీ వైపు రూ. లక్షలు వెచ్చించి ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. కొత్తగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకపోగా చిరువ్యాపారులకు వ్యాపార కేంద్రాలుగా మారాయి. గతంలో వనస్థలిపురం ఫేజ్–4లో నిర్మించిన ఫుట్‌పాత్‌లే నిరుపయోగంగా మారాయని, మళ్లీ రెడ్‌వాటర్ ట్యాంక్ నుంచి ఎన్జీవోస్‌కాలనీ వరకు ఎందుకు నిర్మించారో అర్థం కావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. – వనస్థలిపురం



రైతులకు మరింత చేరువ కావాలి



ఫసియుద్దీన్‌ను సన్మానిస్తున్న చిలుక నర్సింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు జీతభత్యాలు స్వయంగా డ్రా చేసుకొనే వసతి ఉండేదని, మళ్లీ అదే విధంగా అమలు చేయాలని టీఎన్జీవో రాష్ట్ర మార్కెటింగ్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి అన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టీఎన్జీవో మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడారు. పత్తి, ధాన్యం కొనుగోలులో ఏర్పడే సమస్యలను సమగ్ర సర్క్యులర్ ద్వారా అన్ని జిల్లాల అధికారులకు తెలియజేయాలన్నారు. మార్కెట్ కమిటీ రైతులకు మరింత చేరువై ప్రస్తుతం ఉన్న ప్రజా రైతు ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు ఫసియుద్దీన్ జన్మదినం సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముక్రం, వెంకటేశం, చంద్రశేఖర్, సంతోష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



ర్యాలీలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

ఎల్‌బీనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజులు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి డిమాండ్ చేశారు.బీసీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీఎన్‌రెడ్డినగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థుల ఫీజులు గత రెండేళ్లుగా బకాయిలు ఉన్నాయని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగే మల్లేష్ యాదవ్, నాయకులు పగిళ్ల సతీష్, కిషోర్ యాదవ్, అనిల్‌కుమార్ శాలివాహన, భాను గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనులల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. మంగళవారం న్యూ నాగోల్ కాలనీ రోడ్ నెంబర్:1లో రూ.43 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులు కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సమయంలో రోడ్డుపై ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా సరైన లెవెల్స్ చూసుకోవాలని జీహెచ్ఎంసీ ఏఈ మత్స్యనాయక్ కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూ నాగోలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.రాజేందర్ రెడ్డి, నాయకులు మంచి రాజేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

మంత్రికి సన్మానం



మలక్‌పేట: తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఆ సంస్థ నాయ కులు మంగళవారం మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల బాలరాజ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ మజీద్ మంత్రిని కలిసి ఫెడరేషన్ సమస్యలను వివరించినట్లు బాలరాజ్ తెలిపారు.

విద్యార్థుల ఫీజులు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం

విజయనగర్‌కాలనీ: విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.4 వేల కోట్లు చెల్లించడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని, మూసీ సుందరీకరణకు లక్షా యాభైవేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. మూడు నెలల నుంచి ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులు రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం ఇంతవరకు స్పందించడం లేదన్నారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో కలిసి మాసబ్‌ట్యాంక్ నుంచి బీసీ సంక్షేమ భవన్‌కు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..పది నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు ఎన్ని, ఆదాయం ఎంత, కాంట్రాక్టర్లకు ఎంత చెల్లించారు, తదితర బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చోరీకి యత్నం

పోలీసుల అదుపులో బాలుడు

నాగోలు: చోరీ చేసేందుకు యత్నించిన ఓ బాలుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నాగోలు పోలీసుల వివరాల ప్రకారం .. నాగోలు పరిధిలోని త్యాగరాయనగర్ కాలనీలో ఉంటున్న మధుసూదన్ ఇంట్లో మంగళవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడు చొరబడి 10 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసే ప్రయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం నార్త్ కాలనీకి చెందిన రవీందర్‌కు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. హస్తినాపురం నార్త్ కాలనీకి చెందిన రవీందర్ కుమారుడు (ఆరేళ్ల బాలుడు) గుండెకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన సుధీర్‌రెడ్డి ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బుల వివరాలను సీఎం సహాయనిధికి దరఖాస్తు చేశారు. రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమావత్ శ్రీనువాస్‌నాయక్, భీమ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పనితీరు భేష్: జయచంద్రారెడ్డి



తరగతి గదులను పరిశీలిస్తున్న జయచంద్రారెడ్డి

చంపాపేట: చంపపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు భేషుగ్గా ఉందని జిల్లా విద్యా సంవత్సర పాఠశాలల పర్యవేక్షణాధికారి జయచంద్రారెడ్డి కితాబునిచ్చారు. మంగళవారం ఆయన పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, అడ్మిషన్ రికార్డు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, టాయిలెట్స్, తాగునీటి సరఫరా, ఉపాధ్యాయుల బోధనా పద్ధతిని ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, రజిత, పురేందర్‌రెడ్డి, జ్యోతి, వినయ్‌కుమార్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి



లింగోజిగూడ: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలోని విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని మన్సూరాబాద్, హయత్‌నగర్ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్లు మాట్లాడుతూ.. హిందువులకు మాత్రమే ప్రభుత్వం నిబంధనలు పెడుతుందని ఇతరులకు ఆ నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, సునీత, మహేశ్వరీ, స్వప్న, గాయత్రి, శ్యామల, వేదశ్రీ, మురళీ, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బద్ధం సుభాష్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

చైతన్యపురి: గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్, రైల్వే బోర్డు మెంబర్ దివంగత బద్ధం సుభాష్‌రెడ్డి 71వ జయంతి సందర్భంగా పలువురు నాయకులు నివాళులర్పించారు. మంగళవారం వీవీనగర్ కాలనీ చౌరస్తా, పీఅండ్‌టీ కాలనీలలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్ధం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత చైర్మన్‌గా చేసి కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. బీజేపీ నాయకులు ఆనంద్‌కుమార్, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళి, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, శివరాం, రాజేశ్వరి, షేక్ ఉమర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే

మన్సూరాబాద్: రాగాల ఎన్‌క్లేవ్ కాలనీలోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బచ్‌పన్ స్కూల్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ రూపారెడ్డి, రిజినల్ కో ఆర్డినేటర్ సునీతాశ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గ్రాండ్ పేరెంట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.



వేడుకల్లో గ్రాండ్ పేరెంట్స్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



రంగనాయకుల గుట్ట పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా రంగనాయకులగుట్ట ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి పరిసరాలను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందరర్భంగా మాట్లాడుతూ.. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త రిక్షలు, ఆటోలలోనే వేయాలని కోరారు.

మసీదుకు విరాళం ఇస్తామని మోసం

చంచల్‌గూడ: మసీదు నిర్మాణానికి విరాళం ఇస్తానని నమ్మబలికి మోసం చేసిన వ్యక్తిపై ఓ ఇమామ్ మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. చావునీలో నివాసముండే గులాం మోహియుద్దీన్(36) జామా మసీదులో ఇమామ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత శనివారం ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను అబుదాబీ నుంచి మాట్లాడుతున్నానని, మసీదు నిర్మాణానికి రూ.లక్ష 17 వేలు విరాళం ఇచ్చేందుకు నిశ్చయించుకున్నట్లు తెలిపాడు. నగదు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అదనపు ఛార్జీలు కట్టాల్సి ఉంటుందని నమ్మబలికాడు. దీంతో బాధితుడు రెండుమార్లు రూ.43 వేలు, రూ.23 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి విరాళం ఇవ్వకపోగా, ఫోన్‌కు స్పందించడం లేదని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ సెల్‌లో పోలీసులు ఫిర్యాదు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు



చిన్నారులతో ప్రకాష్‌రెడ్డి

చైతన్యపురి: ప్రముఖ సంఘ సేవకుడు ఎలిమినేటి ప్రకాష్‌రెడ్డి తన జన్మదిన వేడుకలను అనాథ శరణాలయంలో జరుపుకున్నారు. చైతన్యపురిలోని స్మైల్ ఫౌండేషన్‌లోని విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. ఫౌండేషన్‌లోని చిన్నారులకు నోటు పుస్తకాలు, దుప్పట్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వంశీగౌడ్, శ్రీకాంత్ రావు, తోట వరుణ్, విజయ్, ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు సరికాదు

మహేశ్వరం: హిందువుల మనోభావాలను దెబ్బతీసే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందువుల ఆలయాలపై అన్యమతస్తులు దాడులు చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. గత పదిరోజుల క్రితం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, నేడు ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో అన్యమతస్తులు కుట్రపూరితంగా వ్యవహరించి దాడులు చేయడం హేయమైందన్నారు. ఘట్టుపల్లి ఆలయ ఆవరణలో అన్యమతస్తుడు మేకను బలివ్వడంతో ఆలయం అపవిత్రమైందన్నారు. ఈ సంఘటనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. అంతకుముందు ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో అభిషేకం చేశారు. పాపయ్యగౌడ్, జంగయ్యయాదవ్, సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కంపు కొడుతున్న సరూర్‌నగర్ చెరువు!

లింగోజిగూడ: ఇప్పటికే ఆ చెరువు మురుగు నీటికి పెట్టింది పేరుగా మారిపోయింది. ఎస్‌టీపీ ప్లాంట్ ఉన్నా నీటి శుద్ధి అంతంత మాత్రమే. ప్లాంట్ సామర్థ్యం కన్నా అధికంగా మురుగు నీరు సరూర్‌నగర్ చెరువులో కలుస్తుండడంతో పూర్తిగా మురుగుమయంగా మారి దుర్వాసన వస్తోంది. దీనికి తోడు స్థానిక కాలనీవాసులు చెత్త, వ్యర్థాలను చెరువుతో పాటు చుట్టూ ఉన్న రోడ్డుకు ఇరువైపులా వేస్తుండటంతో మరింతా దుర్గంధంగా మారుతోంది. సుందరీకరణ దేవుడెరుగు ఉన్న చెరువును మురికి కుంటలా మారుతోంది. చెరువుకు ఆనుకుని ఉన్న గ్రీన్‌పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ ఫేజ్–1, 2, శ్రీనివాస కాలనీలతో పాటు పలు బస్తీల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ఇటీవల పలువురు డెంగీ బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారని ఉన్నతాధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాయంత్రమైతే దోమల బెడద..

సరూర్‌నగర్ కట్ట చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోవడంతో పాటు చెరువులో మురుగు పారుతుండడంతో భరించలేని కంపు కొడుతోంది. మురుగు, చెత్తా చెదారం కారణంగా దోమలు విజృంభిస్తుండడంతో సాయంత్రం అయితే ఇంటి తలుపులు తెరవలేని పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. చెరువు పరిసరాల్లో ఎవరు కూడా చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు కాస్త చొరవ చూపిస్తే తాము సహకరిస్తామని హామీ ఇస్తున్నారు. చెరువు సమీపంలో ఉంటున్న వారికి అవగాహన కల్పించి చెరువుతో పాటు పరిసరాల్లో చెత్త వేయొద్దని హెచ్చరికాలు జారీ చేయాలంటున్నారు. అంతేకాక పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని డిమాండ్ చేస్తున్నారు.